విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అమీర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేట జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో తలసాని యువసేన ఆధ్వర్యంలో తలసాని సోదరుడు శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఈనెల 12 వరకు నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను తలసాని ప్రారంభించారు. శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, బాబాగౌడ్, ప్రకాష్‌గౌడ్, సచిన్, రాహుల్, అబ్రహం, రాకేష్, అర్జున్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కార్పొరేటర్ లక్ష్మి

ఉద్యమంలా మొక్కలు నాటాలి

బేగంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఒక ఉద్యమంలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం డివిజన్‌లోని పలు పార్కుల్లో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్ స్లమ్‌లో పర్యటిస్తున్న విద్యుత్ ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ భీమానాయక్

ఎల్టీ కేబుల్ స్థానంలో ఎయిర్ బంచింగ్ కేబుళ్లు

బేగంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్ స్లమ్ బస్తీలో ఎల్టీ విద్యుత్ కేబుల్ స్థానంలో ఎయిర్ బంచింగ్ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎస్ఈ కరుణాకర్ బాబు, గ్రీన్‌ల్యాండ్ ఏడీ భీమానాయక్, బేగంపేట ఏఈ సాయికిరణ్ తెలిపారు. బుధవారం విద్యుత్ ఉన్నతాధికారులు బస్తీలో పర్యటించారు. ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాన్, హనిష్‌ఖాన్, షర్ఫుద్దీన్, మహ్మద్ ఫర్వేజ్, బాలకృష్ణ, రాఘవ పాల్గొన్నారు.



జగ్గారెడ్డిని కలిసిన డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి

'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి'

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన టి.జగ్గారెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, గ్రేటర్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని, అభ్యర్థి ఎవరైనా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జగ్గారెడ్డి సూచించారని ఆయన పేర్కొన్నారు.

సీఎం హామీని నిలబెట్టుకోవాలి

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమకు 60 గజాల చొప్పున స్థలం కేటాయించి, ఇల్లు కట్టిస్తామని ఎన్నికల సమయంలో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆ హామీని నిలబెట్టుకోవాలని శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలోని బసవతారక నగర్ బస్తీ కమిటీ విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, మాస్టార్జీ, కొల్లూరి భరత్, డాక్టర్ సమత పసునూరి, రవీందర్‌తో కలిసి బస్తీ కమిటీ సభ్యులు మాట్లాడారు. గోపన్‌పల్లి గ్రామం సర్వే నెంబర్.37లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిలో 40 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని బస్తీవాసులు తెలిపారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో తమ గుడిసెలపై కబ్జాదారులు, ప్రైవేట్ వ్యక్తుల కన్ను పడిందని, వారు తమను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రచారం సమయంలో రేవంత్‌రెడ్డి తమ ప్రాంతానికి వచ్చి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడే 60 గజాల చొప్పున స్థలం కేటాయించి, ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని,కొత్త సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం సంయుక్త కమిషనర్ దేవేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ సర్కిల్-19కార్యాలయంలో స్లమ్ లెవల్ ఫెడరేషన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఓ వెంకట్ కిషన్, సీఓ శ్రీనివాస్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సి.ఎస్.రెడ్డి

మహిళల సంక్షేమానికి పెద్దపీట

బోరబండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం రహ్మత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక పట్టణ మహిళా సమాఖ్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి స్వయం సహాయక సంఘాలు, స్త్రీనిధి ద్వారా బ్యాంక్‌ల నుంచి వడ్డీరహిత రుణాలను అందించే పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో యూసీడీ జాయింట్ కమిషనర్ దేవేందర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్ వెంకటయ్య, మహిళా సంఘాల ప్రతినిధులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఆలయాల నిర్వాహకులకు బోనాల చెక్కులను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి



చెక్కులను పంపిణీ చేస్తున్న దేవాదాయ శాఖ అధికారి శేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింగరావు

బోనాలను ఘనంగా జరుపుకోవాలి : మేయర్

బంజారాహిల్స్/ఖైరతాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బోనాల వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆలయ నిర్వాహకులకు బోనాల చెక్కులను ఆమె బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక బోనాలు దేశవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తున్నాయన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను దృష్టిలో పెట్టుకొని నిర్వాహకులకు చెక్కులను అందజేసినట్టు చెప్పారు. అలాగే, జూబ్లీహిల్స్ డివిజన్, సోమాజిగూడ డివిజన్‌కు సంబంధించిన ఆలయాల నిర్వాహకులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి శేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి నర్సింగరావు, వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, ఖైరతాబాద్ నియోజకవర్గంలోని 137 ఆలయాల కమిటీలకు చెక్కులను షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు మల్కు మహేందర్‌బాబు, మామిడి నర్సింగ్ రావు పంపిణీ చేశారు.

మాగంటి గోపీనాథ్ సేవలను కొనసాగిస్తా : వజ్రనాథ్

బోరబండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రజలకు అందించిన సేవలను తాను కొనసాగిస్తానని ఆయన సోదరుడు మాగంటి వజ్రనాథ్ తెలిపారు. రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో బుధవారం మాగంటి గోపీనాథ్ సంతాపసభ నిర్వహించారు. తల్లి మాగంటి మహానంద కుమారి, కూతురు అనూష మాగంటితో కలిసి ఆయన పాల్గొన్నారు. తాను, గోపీనాథ్ ఒకటేనని, కార్యకర్తలందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తనకు సహకరించాలని కోరారు. మహానంద కుమారి మాట్లాడుతూ జనాల్లో తన కొడుకు గోపీనాథ్ ఉన్నాడని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.ప్రహ్లాద్, సదానంద్, సిద్ధార్థ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడాల రాజు, ఇంతియాజ్ ఖాన్, బస్వరాజు, జింక గోపీచంద్ యాదవ్, రమాదేవి, నూర్జహాన్, శివాజీ పాల్గొన్నారు.



మాగంటి గోపీనాథ్ సేవలను కొనసాగిస్తా : వజ్రనాథ్

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎర్రగడ్డ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఎర్రగడ్డ డివిజన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని పోవడమే బీఆర్ఎస్ పార్టీ అభిమతమని అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్‌ఖురేషి, డివిజన్ ఇన్‌చార్జి షేక్ జావెద్, సంజయ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రసూల్, నాయకులు మహ్మద్ సర్దార్, షేక్ అత్తర్, నజీర్, సయ్యద్ కమిల్, మున్నా, మహ్మద్ ముబీన్ ఖాన్, రహ్మత్‌ఖాన్, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.



మహమూద్ అలీతో సమావేశమైన ఎర్రగడ్డ డివిజన్ మైనార్టీ విభాగం నాయకులు

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ వద్దు



టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీర్స్ జేఏసీ నేతలు, ఉద్యోగులు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్రం మానుకోవాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రత్నాకర్ రావు డిమాండ్ చేశారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇంజనీర్లు ఇచ్చిన పిలుపు మేరకు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జీటీఎస్ కాలనీలోని ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయం ఆవరణలో జరిగిన నిరసన కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ చేస్తే ఉద్యోగులు మెరుపు సమ్మె చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీజీట్రాన్స్‌కో చైర్మన్ తులసిరామ్, ట్రాన్స్‌కో కన్వీనర్ వెంకటేశ్వర్, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కిరణ్‌కుమార్, కిషోర్ కుమార్, సంతోష్‌కుమార్, భాస్కరరావు, యాదగిరి, వెంకటేశ్వర్లు, భగత్‌సింగ్, రాము, గోపీ, జ్యోతి, రాణి, సర్వేశ్వర్‌రావు, నాగరాజు, రామచందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి యూసుఫ్‌గూడలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేష్, సుగుణమ్మ, నాగమణి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పవర్ ఇంజనీర్స్ జేఏసీ నిరసన

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు డిమాండ్ చేశారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇంజనీర్స్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం సోమాజిగూడ విద్యుత్‌సౌధ, ఎస్పీడీసీఎల్ ప్రధానకార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో వర్క్ బైకాట్ పేరుతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జనరేటింగ్ స్టేషన్లలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. ధర్నాలో జేఏసీ కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డితో పాటు సదానందం, పలు యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

భద్రాద్రి ఈవోపై దాడికి ఖండన

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాద్రి రామాలయ భూములు కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఆలయ ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.రమ ఖండించారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడిని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలని, ఆలయ భూముల పరిరక్షణకు ఏపీ ప్రభుత్వం చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఫీజు బకాయిలను చెల్లించాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాలేజీ కోర్సులలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీమ్‌లు ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

లఘు ఉద్యోగ భారతి నూతన కార్యవర్గం

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): లఘు ఉద్యోగ భారతి సంస్థ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వసంతం వెంకటేశ్వర్లు, కందుల నరేంద్రనాథ్ దత్ ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని ఇతిహాస హోటల్‌లో జరిగిన లఘు ఉద్యోగ భారతి వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సంఘటన కార్యదర్శి ప్రకాష్ చంద్ర తెలంగాణ ప్రాంత లఘు ఉద్యోగ భారతి నూతన కమిటీని ప్రకటించారు. ప్రత్యేక అతిథిగా తమిళనాడు నుంచి సంయుక్త కార్యదర్శి మోహన సుందరం, సభ్యులు అనిల్, అనంత్, శ్రీధర్ రెడ్డి, తెలంగాణ సంఘటన కార్యదర్శి శివరాం, పారిశ్రామిక వేత్త మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం

హైదర్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన రామదాసుగౌడ్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ అక్బర్ ఫామ్, గ్రీన్ బావర్చి హోటల్, అంబేడ్కర్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ శాలివాహననగర్, జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో...

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు 11కేవీ భరత్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ విజ్ఞప్తి చేశారు.

లారీ నుంచి ఐరన్, కాపర్ మాయం

బేగంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఐరన్, కాపర్ లోడుతో సనత్‌నగర్ నుంచి బయలుదేరిన ఓ లారీలో ఉన్న దాదాపు రూ.10 లక్షల విలువైన కాపర్ మాయమైంది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ డానిష్ అలియాస్ ఆరీఫ్ గత నెల 29న సనత్‌నగర్‌లో దాదాపు రూ.20 లక్షల విలువ చేసే ఐరన్‌తో పాటు కాపర్‌ను లారీలో లోడ్ చేసుకుని బయలుదేరాడు. ఈ సరుకును కర్ణాటక బెహల్గంకు చేర్చాలి. లారీ జహీరాబాద్‌కు చేరుకోగానే లారీ డ్రైవర్ యజమానికి ఫోన్ చేసి లారీలోని కాపర్ దొంగతనానికి గురైందని చెప్పాడు. దీంతో యజమాని లారీ ఆగిన చోటకు వెళ్లి పరిశీలించాడు. లారీలో సగం వరకు ఉన్న కాపర్ మెటీరియల్ పోవడంతోపాటు డ్రైవర్ కూడా అక్కడ లేడు. దీంతో యజమాని డ్రైవర్‌కు ఫోన్ చేయగా తాను ఉద్యోగం మానేశానని, మా ఊరు వెళ్తున్నానని చెప్పాడు. దీంతో అతడిపై అనుమానం వచ్చిన ఉషా ఎంటర్ ప్రైజెస్‌కు చెందిన స్క్రాప్ డీలర్ అమిత్ గార్గ్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫుడ్ లైసెన్స్ మేళాకు స్పందన

ఖైరతాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ జోన్‌లో బుధవారం జరిగిన ఫుడ్ లైసెన్స్ మేళాకు విశేష స్పందన లభించింది. ఒక్క రోజే 73 మంది వ్యాపారులు ఫుడ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతోపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో వ్యాపారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం మొదటి అంతస్తులో ఈ మేళా జరిగింది. శిబిరాన్ని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సందర్శించారు. సర్కిళ్ల ఉప కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, సమ్మయ్యతో పాటు వైద్యాధికారులు, జోనల్ ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సూర్య పాల్గొన్నారు. కాగా, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ల జారీ నిరంతర ప్రక్రియ అని, వ్యాపారులు విధిగా లైసెన్స్‌లు పొందాలని అధికారులు సూచించారు.

టీవీ చర్చలో గలాటా

- **బీఆర్ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నేత ఫిర్యాదు**

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టీవీ చర్చలో మాటామాట పెరిగి కాంగ్రెస్ నాయకుడిపై బీఆర్ఎస్ నాయకుడు చేయి చేసుకున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఓ టీవీ చర్చలో బీఆర్ఎస్ తరఫున గౌతమ్‌ప్రసాద్, కాంగ్రెస్ తరఫున దేవుని సతీష్ పాల్గొన్నారు. ఓ అంశంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి వాగ్వాదానికి దారితీసింది. గౌతమ్‌ప్రసాద్ ఆగ్రహంతో సతీష్‌పై చేయి చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై సతీష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేమపేరుతో వంచన.. పెళ్లి అనగానే దూరం

- **తీవ్ర మనోవేదనతో యువతి ఆత్మహత్య**

బేగంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీవే నా ప్రాణం అంటూ వెంటపడ్డాడు. కొన్నినెలలుగా ఇద్దరూ ప్రేమించుకున్నారు. తీరా పెళ్లి చేసుకోమని యువతి అడగడంతో దూరంగా ఉంటున్నాడు. రెండుసార్లు పెద్దలు చెప్పినా యువకుడు వినకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో జరిగింది. బేగంపేట ఎస్సై షేక్ షఫీ తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్‌కస్టమ్స్ బస్తీకి చెందిన మెహరున్నీసా భర్త నజీర్ చనిపోయారు. వీరికి కుమారుడు, కుమార్తె అయేషా ఫాతిమా(19) ఉన్నారు. ఇదే బస్తీకి చెందిన అజారుద్దీన్ అలియాస్ సోయల్‌తో ఫాతిమా పరిచయం ప్రేమ వరకు వెళ్లింది. పెళ్లి ప్రస్తావన తేవడంతో ఫాతిమాను పట్టించుకోవడం మానేశాడు. ఈ విషయం పెద్దల వరకు వెళ్లడంతో పలుమార్లు ఇరు కుటుంబాల వారు కూర్చొని మాట్లాడుకున్నారు. అప్పటికి సరే అని తర్వాత పెళ్లి చేసుకోనని చెప్పడంతో తీవ్ర మనోవేదనకు గురైన అయేషా ఫాతిమా మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి సోదరుడు హయాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోరిక తీర్చకపోతే చంపేస్తా..

- **యువతిపై రాయితో దాడి**

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'నా కోరిక తీర్చకపోతే చంపేస్తా.. వీడియోలు సోషల్ మీడియాలో పెడతా' అంటూ బెదిరించడమే కాకుండా అందరూ చూస్తుండగా యువతిని రోడ్డు మీదకు ఈడ్చుకువచ్చి రాయితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. షేక్‌పేట మారుతీనగర్‌కు చెందిన యువతి ఓ డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టు. 2018లో ఓ వ్యక్తితో వివాహమైంది. అంతకు ముందు కిరణ్ అనే యువకుడితో సహజీవనం చేసింది. పెళ్లి అయిపోయాక ఇద్దరు తరచూ మాట్లాడుకునే వారు. దీనిని అదునుగా తీసుకొని కిరణ్ తనతో ఉండాలంటూ ఒత్తిడి తేవడం మొదలు పెట్టాడు. తన కోరిక తీర్చకపోతే ఆమెకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కుటుంబసభ్యులకు పంపించడమే కాకుండా సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో ఆమె మాట్లాడడం మానేసింది. ఈనెల 7న యువతి పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లిన కిరణ్ ఆమెను చేయి పట్టుకొని ఈడ్చుకుంటూ రోడ్డు మీదకు తీసుకువచ్చి రాయితో కొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని బెదిరించారు. అతడిని విడిపించుకున్న యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో చెట్టును ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన సురేందర్‌సింగ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ నెల 8న జూబ్లీహిల్స్‌లోని బ్రాడ్‌వే పబ్‌కు వచ్చాడు. స్నేహితులతో కలిసి పార్టీలో పాల్గొని మద్యం తాగాడు. అర్ధరాత్రి తర్వాత కారులో ఇంటికి బయలు దేరాడు. రోడ్డు నెంబర్.51కి రాగానే కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టి బోల్తా పడింది. డ్రైవింగ్ సీటులో ఉన్న సురేందర్‌సింగ్ క్షేమంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సురేందర్‌కు శ్వాస పరీక్ష చేయగా 185 బీఏసీ వచ్చింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మద్యం మత్తులో యువకుడు కారుతో ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టాడు. కొంపల్లికి చెందిన ప్రణవ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈనెల 8న మణికొండలోకి క్వేక్ అరెనా పబ్‌లో పార్టీ ఉండడంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అభిషేక్‌కుమార్, ఆశిష్, అనురాగ్‌తో కలిసి వెళ్లాడు. అక్కడ రాత్రి పొద్దు పోయే వరకు గడిపి మద్యం తాగారు. అదే మత్తులో ప్రణవ్ కారులో స్నేహితులతో కలిసి బంజారాహిల్స్ వైపు బయలు దేరాడు. ఎన్టీఆర్ ట్రస్టుభవన్ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి జీహెచ్ఎంసీ డివైడర్‌కు ఢీ కొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నలుగురికి శ్వాస పరీక్షలు చేశారు. ప్రణవ్‌కు 167 బీఏసీ, అభిషేక్ 77, అనురాగ్‌కు 96 బీఏసీ వచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యార్థులపై కేసు నమోదు

మద్యం మత్తులో కారు నడిపి ప్రమాదానికి కారణమైన ఐదుగురు వైద్య విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మంగళవారం రాత్రి 040 పబ్బుకు వచ్చి మద్యం తాగారు. తిరుగు ప్రయాణంలో ప్రశాసన్ నగర్ సమీపంలోకి రాగానే విద్యార్థులు ఉన్న కారు అదుపుతప్పి మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు వైద్య విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఐదుగురికి శ్వాస పరీక్ష చేయగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై బ్లాక్ మెయిల్

- **వ్యక్తిపై కేసు నమోదు**

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాస్థలాలు లేవు.. విద్యార్థులకు సరైన రక్షణ ఏర్పాట్లు లేవంటూ ప్రైవేట్ పాఠశాలలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్.12లో ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో వసతులు సరిగా లేవని, పిల్లలకు రక్షణ లేదని బంజారాహిల్స్‌కు చెందిన కొమ్ము విజయ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పాఠశాలల యాజమాన్యాలు విజయ్‌ని సంప్రదించగా తనకు డబ్బులు ఇస్తే ఫిర్యాదు వాపసు తీసుకుంటానంటూ బ్లాక్ మెయిల్ చేశాడు. ఈ విషయాన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు షేక్‌పేట మండల ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ సలహాదారుడు, ఎస్వీఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ కరస్పాండెంట్ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో నగదు మాయం

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఆస్పత్రి పార్కింగ్‌లో పెట్టిన కారు నుంచి నాలుగు లక్షల రూపాయలు మాయమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రవినాథ్ ఈనెల 4న భార్యను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. అత్యవసర చికిత్స కోసం అవసరం అవుతాయనే ఉద్దేశ్యంతో రూ.4 లక్షల నగదును కారు డిక్కీలో దాచారు. కారును వ్యాలెట్ డ్రైవర్‌కు ఇచ్చాడు. రెండున్నర గంటల అనంతరం ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి కారు తీసుకుని ఉస్మానియా యూనివర్సిటీ వెళ్లారు. అదేరోజు రాత్రి సొంతూరు వెళ్లారు. రెండ్రోజుల తర్వాత కారు డిక్కీలో డబ్బులు గుర్తుకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో బుధవారం వచ్చి అపోలో ఆస్పత్రి సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు

వికలాంగుల హక్కుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

రెజిమెంటల్‌బజార్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతల బృందం బుధవారం పద్మారావుగౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మేనిఫెస్టోలో వికలాంగులకు ప్రకటించిన హామీలను అమలు పరిచేలా ఒత్తిడి తేవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు రాంబాబు, కొల్లి నాగేశ్వర్‌రావు, భువనేశ్వర్ పాల్గొన్నారు.

నేడు తాడ్‌బండ్ దేవాలయంలో హుండీ లెక్కింపు

బోయినపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ ఆంజనేయస్వామి ఆలయంలో నేడు హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఆలయ కార్యానిర్వహణాధికారి నరేందర్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సీసీ కెమెరాలు, పోలీసుల నిఘాలో దేవాలయశాఖ అధికారులు, సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు రశీదులు పొందకుండా ఎవరికి విరాళాలు అందజేయవద్దని ఆలయ ఈఓ తెలిపారు.



తుకారాంగేట్ చౌరస్తాలో సమ్మె చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కార్మికుల హక్కులను కాలరాస్తే ఖబడ్దార్

అడ్డగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాస్తే ఖబడ్దార్ అని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.మల్లేష్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించిన కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం తుకారాంగేట్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మికులతో సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఉపయోగ పడే విధంగా నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. దీనివల్ల కార్మికులు కనీస వేతనాలు పొందలేరని, యూనియన్ పెట్టుకునేటువంటి హక్కు లేకుండా చేస్తుందన్నారు ఈ సమ్మెలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, మల్లయ్య, ఎల్లయ్య, రాజు, రాంచందర్, యాదయ్య, రాములు, బిక్షపతి, మంగమ్మ యాదమ్మ శ్యామలలు పాల్గొన్నారు.



హెచ్ఆర్‌సీ ఆఫ్ ఇండియా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడి చేతుల మీదుగా పదవీ పత్రాన్ని అందుకుంటున్న జాతీయ కార్యదర్శి ఎల్లంకి వీరేశం

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ కార్యదర్శి నియామకం

అడ్డగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శిగా తుకారాంగేట్‌కు చెందిన ఎల్లంకి వీరేశం గుప్త నియమితులయ్యారు. నియామకపత్రాన్ని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం శ్రీనివాసగుప్త చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పదవి అప్పగించడంలో ప్రత్యేకపాత్ర వహించిన జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు చీకోటి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



రైలులో గంజాయి సరఫరా చేస్తున్న మహిళను అరెస్టు చేసి చూపుతున్న రైల్వే సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్

రైలులో గంజాయి పట్టివేత

● మహిళ అరెస్ట్ - ఒకరు పరార్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రైలులో గంజాయి సరఫరా చేస్తున్న ఓ మహిళను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ మహరాష్ట్ర నాందేడ్‌కు చెందిన జి. సరస్వతి(52) బెర్హంపూర్ రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగిలో రూ1.50 లక్షల విలువ చేసే మూడు కిలోల గంజాయి సరుకుతో ప్రయాణం చేస్తుంది. విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ చేరుకోవడంతో అప్పటికే మాటువేసిన రైల్వే పోలీసులు జనరల్ బోగిలో తనిఖీలు చేయగా అనుమానస్పదంగా ఉన్న సరస్వతిపై అనుమానం రావడంతో ఆమె వద్ద ఉన్న లగేజీని తనిఖీ చేయగా గంజాయి సరుకు ఉందని తెలుసుకున్నారు. సరఫరా చేస్తున్న ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అసలు గంజాయి సూత్రధారి హైదరాబాదాద్ డబిల్‌పురకు చెందిన గోపాల్‌సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. ఆమె నుంచి గంజాయి సరుకు తీసుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పరారీలో ఉన్న గోపాల్‌సింగ్ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుస్సేన్ సాగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కానిస్టేబుల్ మోహన్, హోమ్ గార్డ్ శేఖర్‌తో కలిసి బ్లూకోల్ట్ విధులు నిర్వహిస్తున్న సందర్భంగా నెక్లెస్‌రోడ్డు పీవీమార్గ్‌లో మోక్ష్ హోటల్ ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాశయంలో సుమారు 30-35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడాన్ని గుర్తించారు. వెంటనే పైఅధికారులకు సమాచారం ఇచ్చి మృతదేహన్ని వెలికితీసి చుట్టు పక్కల వారిని విచారించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే లేక్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పీకల దాక అప్పులు చేసి తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. మేడ్చల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్(25) ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగి, తాగుడికి బానిసై తీవ్రస్థాయిలో అప్పులు చేసి తీర్చలేకపోయాడు. గతంలో అప్పులు తీర్చలేక నాలుగుసార్లు ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పులు పెరిగిపోవడంతో బుధవారం మేడ్చల్ - మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.303 కోట్ల చుట్టూ
కంటోన్మెంట్ రాజకీయాలు

క్రెడిట్ తమదంటే తమదంటూ పోటాపోటీగా పార్టీల ప్రచారం



సికింద్రాబాద్, మారేడుపల్లి, బోయినపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం సేకరించే కంటోన్మెంట్ భూములకు చెల్లించనున్న రూ.303 కోట్ల పరిహారం చుట్టూ ప్రస్తుతం సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజకీయాలు నడుస్తున్నాయి. కంటోన్మెంట్ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.303 కోట్లు బోర్డు ఖాతాలో జమ కానుండడం దీనికి నిదర్శనమని బీజేపీ చెబుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే కారిడార్ల నిర్మాణం జరగనుందని, కాబట్టే భూముల సేకరణకు అవసరమైన రూ.303 కోట్ల నిధులు బోర్డుకు విడుదల చేస్తున్నామని కాంగ్రెస్ శాసనసభ్యుడు స్పష్టం చేస్తున్నారు. అయితే తమ పార్టీ అధికారంలో ఉండగా కేసీఆర్, కేటీఆర్‌లు ప్రతిపాదనలను అప్పుడు పక్కన పెట్టి, ఇప్పుడు వాటిని ఆమోదించి బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు గేమ్ ఆడుతున్నాయని,

అప్పుడే భూములు కేటాయించి ఉంటే ఈపాటికే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తయి ప్రజలకు మేలు జరిగి ఉండేదని బీఆర్ఎస్ నాయకులు వాదిస్తున్నారు. అసలు బోర్డుకు చెందిన భూములన్నీ ఒకప్పుడు గ్రామ కంఠాలని, అవి కంటోన్మెంట్ బోర్డు స్థలాలే కావని, అలాంటప్పుడు కేంద్రం కంటోన్మెంట్ ప్రజలకు మేలు చేసినట్టు ఎలా అవుతుందని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు సరికొత్త వాదనను తెర మీదకు తెచ్చారు.

బీజేపీ-కాంగ్రెస్ పార్టీల రాజకీయ డ్రామా



మీడియాతో మాట్లాడుతున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం విషయంలో బీజేపీ- కాంగ్రెస్ పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బోర్డు మాజీ సభ్యులతో కలిసి బోయినపల్లిలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు కేటాయించాలని కేసీఆర్, కేటీఆర్‌లు పదే పదే విజ్ఞప్తి చేశారని చెప్పారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డదిడ్డమైన షరతులు విధించి, భూములు కేటాయించకుండా ఆటంకాలు సృష్టించిందని ఆరోపించారు. ఏదేమైనప్పటికీ అభివృద్ధిని కాంక్షిస్తున్నందున తాము ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనలు రూపొందించిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌లదేనన్న వాస్తవం ప్రజలకు తెలుసన్నారు.

సీఎం చొరవ వల్లనే.. ఇదంతా : ఎమ్మెల్యే శ్రీగణేష్



మీడియా సమావేశంలో శ్రీగణేష్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, దీనిలో భాగంగానే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేయాలని నిర్ణయించారని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బుధవారం పికెట్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాలో మాట్లాడారు. కారిడార్ల నిర్మాణానికి అవసరమైన కంటోన్మెంట్ భూములకు బదులుగా రూ.303 కోట్ల నిధులు ప్రకటించారని చెప్పారు. ఈ మొత్తాన్ని కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని గత నవంబరులో స్పష్టం చేశారని తెలిపారు. సీఎం చొరవ వల్లే అభివృద్ధికి వెచ్చించే అవకాశం కలిగిందని ఆయన పేర్కొన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి తామేదో చేస్తున్నామంటూ కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లు ప్రచారం చేసుకుంటున్నారని శ్రీగణేష్ విమర్శించారు.

కిషన్‌రెడ్డి, ఈటలదే క్రెడిట్ : జె.రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వల్లనే రూ.303 కోట్లు కంటోన్మెంట్ బోర్డుకు రానున్నాయని సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ బుధవారం మీడియా సమావేశంలో అన్నారు. రెండు కారిడార్ల నిర్మాణానికి బోర్డుకు చెందిన 24 ఎకరాల భూములు అవసరం కాగా, వాటిని సేకరిస్తున్నందుకు రూ.303 కోట్లు చెల్లించడానికి రాష్ట్రప్రభుత్వం అంగీకరించిదని ఆయన తెలిపారు. అయితే కంటోన్మెంట్ బోర్డుకు చెందిన భూములు కోల్పోతున్నందుకు వచ్చే పరిహారం కాబట్టి, ఈ మొత్తాన్ని బోర్డు ఖాతాకు జమ చేయాలని, తద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టే వెసులుబాటు కలుగుతుందని తాను నామినేటెడ్ సభ్యునిగా ఉన్న సమయంలో కేంద్రమంత్రి కేంద్రం పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చారని చెప్పారు. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌ల కృషి వల్ల రూ.303 కోట్ల కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా ఖాతాలో జమ కాకుండా, కంటోన్మెంట్ బోర్డుకు వస్తున్నాయని రామకృష్ణ వెల్లడించారు.

బీజేపీకి క్రెడిట్ ఎలా వస్తుంది? : మర్రి అమరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మర్రి అమరేందర్‌రెడ్డి

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి పరిహారంగా రూ. 303 కోట్లు కంటోన్మెంట్ బోర్డుకు రావడం తమ గొప్పతనంగా బీజేపీ ఎంపీలు ప్రకటించుకోవడం సిగ్గు చేటని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మర్రి అమరేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు కంటోన్మెంట్ బోర్డు భూములుగా చెబుతున్న స్థలాలన్నీ గ్రామ కంఠ భూములని, వీటిని రక్షణ శాఖ, కంటోన్మెంట్ బోర్డు కొనుగోలు చేసినవి కాదని ఆయన బుధవారం మీడియా సమావేశంలో పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల కంటోన్మెంట్ అభివృద్ధికి చేసింది శూన్యమని, చేతనైతే 1,500 కోట్ల రూపాయిల సర్వీసు చార్జీల బకాయిలు వసూలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ ప్రజల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను సీఎం చాటుకుంటున్నారని, దీనిలో భాగంగానే అభివృద్ధికి కృషి చేస్తున్నారని అమరేందర్‌రెడ్డి చెప్పారు.



విశ్వకర్మ సంఘం వద్ద ముత్యాలమ్మ ఘటం

వీధి వీధినా ముత్యాలమ్మ ఘటం

రాంగోపాల్‌పేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బోనాలను పురస్కరించుకొని అమ్మవారి దర్శనానికి వెళ్లలేని వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆశీస్సులు అందించడానికి ఘటాలు వీధి వీధినా తిరుగుతాయి. బుధవారం సికింద్రాబాద్ కళాసిగూడలోని ముత్యాలమ్మ ఘటం వీధి వీధినా తిరుగుతూ సోమసుందరంవీధిలోని విశ్వకర్మ సంఘ భవనం వద్దకు రాగానే సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రదాన కార్యదర్శి గిర్మాపురం బాస్కర్, కోశాధికారి బోనాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి, ఇతర కార్యవర్గ సభ్యులు వారి కుటుంబాల సమేతంగా అమ్మవారికి పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తమకు జీవనాధారం లేకుండా చేశారు.. తమ కుటుంబాలను ఆదుకోవాలని స్టాంప్ వెండర్స్, టైపిస్టులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి కోర్టు వద్ద ఫుట్‌పాత్‌లపై పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, నిర్దాక్షిణ్యంగా ఫుట్‌పాత్‌లపై నుంచి ఖాళీ చేయించారని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అధైర్యపడొద్దని, తాను సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.



ఆలయాల నిర్వాహకులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక

మారేడుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మారేడుపల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 256 దేవాలయాలకు సుమారు రూ.72 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లష్కర్ బోనాలకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, కార్పొరేటర్ కొంతం దీపిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా తార్నాకలోని నాగార్జుననగర్ కమిటీ హాల్ ఆవరణలో బుధవారం కాలనీ వాసులతో కలిసి ఆమె మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, నాగార్జుననగర్ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తార్నాకలోని నాగార్జుననగర్ కమిటీహాల్ ఆవరణలో మొక్కలను నాటి నీరు పోస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాదచారులకు ఇబ్బంది కలిగించేవిధంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బుధవారం తార్నాకలో పర్యటించిన ఆమె ఫుట్‌పాత్‌లలను ఆక్రమించి అక్రమంగా వ్యాపారాలను నిర్వహిస్తున్న వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను తొలగించారు.



సింహద్వారం



ఇత్తడి తాపడంతో ఆలయ గోపురం

అయ్యప్ప ఆలయ గోపురానికి ఇత్తడి తాపడం

చిలకలగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ అయ్యప్ప ఆలయ అభివృద్ధి చర్యల్లో భాగంగా గోపురం, సింహ ద్వారాన్ని రాగి తాపడంతో అందంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆలయ ప్రతినిధి సునీల్ తెలిపారు. దాతలు తలారి వినోద్ గురుస్వామి, చలువది రవీందర్ రూ.26లక్షలు ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసినట్లు తెలిపారు. తుది మెరుగుల అనంతరం సెప్టెంబరులో శబరిమల అయ్యప్ప ప్రధాన అర్చకుడు పూజలతో ప్రారంభించనున్నట్లు వివరించారు. ఆలయ అధ్యక్షుడు రవీంద్రన్, కార్యదర్శి కె.పి.సి.నాయర్, కోశాధికారి గంగాధరన్ దాతలు అందజేసిన విరాళానికి ధన్యవాదాలు తెలిపారు.



పద్మారావునగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్‌వి కర్ణన్

సత్వరమే నాలా పనులు పూర్తిచేయాలి

● జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్

పద్మారావునగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చే వరదల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. ముషీరాబాద్ సర్కిల్ నాగమయ్యకుంట నుంచి పద్మారావునగర్ వరకు చేపట్టిన నాలా పనులను ఆయన పరిశీలించారు. గతంలో ఎస్ఎన్‌డీ చేపట్టిన నాలా అభివృద్ధి పనులు ఇతరత్రా కారణాల వల్ల నిలిచిపోయాయని, అసంపూర్తిగా ఉన్న నాలా పనులను సత్వరమే పూర్తిచేయాలని, అందుకు కావాల్సిన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రామసుజా రెడ్డి, జోనల్, సర్కిల్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కట్టడాలను ప్రభుత్వమే నిర్మించాలి

బోయినపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు నిర్మిస్తున్న ప్రధాన రహదారిలో బోయినపల్లి పరిధిలో కనుమరుగవుతున్న కొన్ని కట్టడాలను ప్రభుత్వం నిర్మించేలా కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కోరారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బోయినపల్లి పంప్‌హౌస్ నిర్మాణ పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. బోయినపల్లి ప్లేగ్రౌండ్ స్థలంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ సొంత నిధులతో రెజ్లింగ్, జిమ్, క్రీడాకారుల కోసం గదులు, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాలు నిర్మించామని, అవి రోడ్డు విస్తరణలో కనుమరుగవుతున్నాయని, అలాంటి నిర్మాణాలను ప్రభుత్వ నిధులతో నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, హెచ్‌ఎండీఏ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని అన్నారు. ఈ విషయమై స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, ప్లే గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు యాదగిరి, బండి శ్రీనివాస్, కరణ్‌సింగ్, సురేష్, రాజు, మధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లిలో పంప్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జంపన ప్రతాప్